క్లుప్తంగా

దుర్గమ్మ సేవలో సద్గురు మధుసూదనసాయి



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మను సద్గురు మధుసూదనసాయి సోమవారం దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన సద్గురు మధుసూదనసాయికి ఆలయ అధికారులు సాదరంగా స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకుని పూజా సామగ్రి, పట్టుచీరలను సమర్పించారు. అనంతరం ప్రత్యేక పూజలు జరిపించుకోగా, వేద పండితులు ఆశీర్వచనం, ఆలయ ఏఈవో రమేష్‌బాబు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు.

స్వశక్తిపై ఆధారపడితేనే మంచిపేరు



ఆటోనగర్(విజయవాడతూర్పు): మహిళలు స్వశక్తి మీద ఆధారపడి జీవించినప్పుడే సమాజంలో మంచిపేరు ఉంటుందని కోవే ఏపీ చాప్టర్ రాష్ట్ర అధ్యక్షులు రాధిక అన్నారు. మూడు రోజుల నుంచి సుమారు 150 మంది మహిళలకు కేకుల తయారీపై శిక్షణ సోమవారంతో ముగిసింది. ఈసందర్భంగా పిజ్జా, చిరుధాన్యాలతో బిస్కెట్ తదితర వాటిని మహిళలు తయారు చేసే విధానాన్ని నిపుణుల ద్వారా నేర్చుకున్నారు. రాధిక మాట్లాడుతూ శిక్షణలో నేర్చుకున్న తర్వాత మీ ఇంటి వద్ద నిత్యం కేక్‌లను తయారు చేస్తే ఆర్థిక ఎదుగుదలకు ఎంతగానో ఉపయోగ పడుతుందన్నారు. కొందరు మహిళలు గతంలో శిక్షణ పొందినవారు సొంతంగా తయారు చేసిన ఆర్డర్‌లను వేరే షాపులకు, ఫంక్షన్‌లకు కేక్‌లను తయారు చేసి లబ్ధి పొందుతున్నారన్నారు. మరి కొందరైతే బ్యాంకుల ద్వారా రుణాలు తీసుకొని ఇంటి వద్దనే సరుకులను తయారు చేస్తూ ఆర్థికంగా కుటుంబాలు నిలదొక్కుకున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కోవే కార్యదర్శి విజయలక్ష్మి, మోహిణి, విజయవాడ చుట్టు పక్క ప్రాంతాల మహిళలు పాల్గొన్నారు.

186 మంది దివ్యాంగులు ఉద్యోగాలకు ఎంపిక

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): మాచవరంలోని తమ సంస్థ ఆధ్వర్యాన సోమవారం నిర్వహించిన జాబ్‌మేళాలో 186 మంది విభిన్న ప్రతిభావంతులకు వివిధ ప్రైవేటు కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపికయ్యారని గ్రో పీడబ్ల్యూడీ సంస్థ మేనేజర్ జైగణేష్ చెప్పారు. వివిధ ప్రాంతాల నుంచి మొత్తం 310 మంది విభిన్నప్రతిభావంతులు హాజరయ్యారని, వారికి ప్రైవేటు కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించి ఉద్యోగాలకు ఎంపిక చేశారని తెలియజేశారు. తమ సంస్థ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహిస్తుంటామని, ఉద్యోగాలు అవసరమైన విభిన్న ప్రతిభావంతులు 73311 49646లో సంప్రదించాల్సిందిగా ఆయన కోరారు.

పశువుల్లో కృత్రిమ గర్భధారణతో మేలు

ఇబ్రహీంపట్నం(మైలవరం): పశువుల్లో కృత్రిమ గర్భధారణ రైతులకు లాభదాయకమని పశుగణాభివృద్ధి జిల్లా ఉప సంచాలకులు డాక్టర్ శ్రీనివాసరావు తెలిపారు. ఇబ్రహీంపట్నం మండలం కొండపల్లి పశువుల ఆసుపత్రిలో లేగ దూడల ప్రదర్శన సోమవారం నిర్వహించారు. ఉప సంచాలకులు డాక్టర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ లేగ దూడల పెంపకంలో రైతులు తగిన జాగ్రతలు తీసుకోవాలని రైతులకు సూచించారు. లింగ నిర్ధారణ, కృత్రిమ గర్భోత్పత్తి విధానంలో 90 శాతం ఆడ దూడలు జన్మిస్తాయన్నారు. నాలుగు సంవత్సరాల్లో గ్రామాల్లో పాల ఉత్పత్తి రెట్టింపు అయ్యే అవకాశం ఉందన్నారు. దీంతో పశుపోషణ లాభదాయకంగా మారుతుందన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ రాజకుమారి, వాసు పాల్గొని లేగ దూడల యజమానులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సహాయ సంచాలకులు కాటూరి వెంకటేశ్వరరావు, రాధాకృష్ణమూర్తి, కృష్ణమూర్తి, ఇబ్రహీంపట్నం, నందిగామ గ్రామాల పశువైద్యులు స్వాతి అయ్యప్ప, శైలు మాధురి, మోహన్ కిశోర్, ఇబ్రహీంపట్నం పశుసంవర్ధక శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

సెమీ కండక్టర్ రంగానికి ప్రాధాన్యం

పెనమలూరు: ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంలో ఎదురవుతున్న సవాళ్లను ఎదుర్కొవటానికి సెమీ కండక్టర్ పరిశ్రమల్లో ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని బెంగళూరుకు చెందిన చిప్ ఎడ్జ్ టెక్నాలజీ సీఈఓ సుంకర వెంకట్ అన్నారు. గంగూరు ధనేకుల ఇంజినీరింగ్ కాలేజీలో ఈసీఈ విభాగం ఆధ్వర్యంలో సోమవారం చిప్ డిజైన్ సవాళ్లు, సెమీ కండక్టర్ పరిశ్రమల్లో ఉపాధి అవకాశాలు అనే అంశంపై అవగాహన సదస్సు జరిగింది. వెంకట్ మాట్లాడుతూ.. ఎస్‌ఓసీ డిజైన్లలో భద్రత, డిజైన్ ధ్రువీకరణ కారణాలతో సమస్యలు వస్తాయన్నారు.

అభివృద్ధికి చిరునామా ఊర్మిళానగర్

అదనపు హంగులు ఏర్పాటు
- రూ. 20.29 కోట్లతో మౌలిక సదుపాయాలు
- డీబీటీ రూ. 42. 62 కోట్లు
- నాన్ డీబీటీ ద్వారా రూ. 22. 28కోట్లు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): అభివృద్ధికి చిరునామాగా ఊర్మిళానగర్ కొంత హంగులు అమర్చుకుంది. ఈ ప్రాంతం 'పశ్చిమ'లోని 43వ డివిజన్ పరిధిలో ఉండేది. ఇది పూర్తిగా వెనకపడిన ప్రాంతం. పేరుకు విజయవాడ కార్పొరేషన్‌లో భాగమైనా ఈ ప్రాంతం అభివృద్ధికి నోచుకోలేదు. ఇక్కడ నివసించే వారంతా పేద వర్గాలే. రోడ్లు, డ్రెయిన్లు, తాగునీటి సరఫరా సక్రమంగా లేక ఈ ప్రాంత వాసులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. వానలు పడితే రోడ్లు నీటమునిగి కనిపించేవి. గత ప్రభుత్వాలు వారికి కేటాయించిన ఇళ్లను 22–ఏ జాబితాలో చేర్చి క్రయ, విక్రయాలు లేకుండా చేశాయి. ఇళ్లకు రిజిస్ట్రేషన్లు లేక, రుణ సదుపాయం అందరకు ప్రైవేటు అప్పుల వారిని ఆశ్రయించి నలిగిపోయేవారు. రాష్ట్రంలోని అతి పెద్ద ఐరన్‌మార్కెట్ ఈ ప్రాంతంలోనే ఉంది. ఇక్కడ కార్మికులకు సౌకర్యాలు లేవు. అంతర్గత రోడ్లు దెబ్బతిని ఐరన్ మార్కెట్ అధ్వానంగా మారింది. ఇదంతా గతం.

వైఎస్సార్ సీపీ హయాంలో మారిన రూపురేఖలు

వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఊర్మిళానగర్ రూపు రేఖలు పూర్తిగా మారాయి. కోట్లాది రూపాయల నిధులతో బీటీ రోడ్లు, సీసీ రోడ్లు, డ్రెయిన్లు, ఔట్‌ఫాల్‌డ్రెయిన్లు నిర్మించారు. పార్కులు నూతన శోభను సంతరించుకున్నాయి. పార్కుల్లో టెన్నిస్ కోర్టులు, స్కేటింగ్ ట్రాక్‌ల నిర్మాణం శరవేగంగా జరుగుతోంది. ప్రధాన రహదారి అద్దంలా మెరిసిపోతోంది. అమృత పథకం ద్వారా 1500 ఇళ్లకు నీటి కుళాయి వచ్చింది. డివిజన్‌లోని పేదలకు ప్రభుత్వం డీబీటీ ద్వారా రూ. 42.62 కోట్లు ఖాతాల్లో జమచేసింది. నాన్‌డీబీటీ ద్వారా రూ. 22.28 కోట్లు లబ్ధి చేకూరింది. చిల్డ్రన్స్‌పార్క్, రోజ్ పార్క్, పగోడ పార్క్, భవానీపురం ఎల్ఐజీలో పార్క్ రూ. 2.50 కోట్లతో అభివృద్ధి జరిగింది. 10 ఏళ్లుగా రిజిస్ట్రేషన్ లేని ఇళ్లకు ఈ ప్రభుత్వం 22 ఏ నుంచి తొలగించి రిజిస్ట్రేషన్ సౌకర్యం కల్పించింది. ఇళ్ల నిర్మాణానికి ప్లాన్‌లు ఇస్తోంది.



ఊర్మిళానగర్ ప్రధాన రహదారి.. బీటీ రోడ్డు



భవానీపురం ఎల్ఐజీలో నిర్మించిన సీసీ రోడ్డు



చిల్డ్రన్స్ పార్క్ లోపలి భాగం

22 ఏ నుంచి ఉపశమనం



వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఊర్మిళానగర్‌ను పట్టిపీడిస్తున్న సమస్యకు పరిష్కారం లభించింది. ముఖ్యంగా 22 ఏ సమస్యకు ప్రభుత్వం పరిష్కారం చూపింది. నలభై ఏళ్ల క్రితం ప్రభుత్వం స్థలాలు కేటాయిస్తే 72 గజాల్లో ఇళ్ల నిర్మాణం చేసుకున్నాం. పదేళ్ల క్రితం వీటిని నిషేధిత జాబితా 22 ఏలో చేర్చారు. అప్పటి నుంచి రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. అమ్మాలన్నా అవకాశం లేదు. రుణాలు వచ్చేవి కావు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే 22 ఏ జాబితా నుంచి తొలగించింది. మాకు ఉపశమనం లభించింది.

–కనకం వెంకటేశ్వర్లు యాదవ్, స్థానికుడు

ఇచ్చిన ప్రతి హామీని అమలు చేశాం



ఊర్మిళానగర్ 2019కు ముందు.. తర్వాత అని చెప్పుకునేంతగా అభివృద్ధి చేశాం. డివిజన్ మొత్తం సీసీ రోడ్లు నిర్మాణం, డ్రెయిన్లు, తాగునీటి పైపులైన్ల నిర్మాణం చేశాం. మురుగు సమస్య పరిష్కారానికి ప్రధాన రహదారి వెంట ఔట్‌ఫాల్ డ్రెయిన్ నిర్మించాం. ఐరన్ యార్డులో 4వేల మంది కూలీలకు టాయిలెట్లు, భోజనాలు చేసేందుకు షెడ్లు నిర్మించాం. ఎన్నికల్లో చెప్పిన దానికంటే ఎక్కువే అభివృద్ధి చేశాం.

– బాపతి కోటిరెడ్డి, కార్పొరేటర్

ప్రత్యక్ష నగదు పథకం

పథకం పేరు	లబ్ధిదారుల సంఖ్య	మొత్తం రూ. లలో
జగనన్న అమ్మ ఒడి	1,491	6,45,45,279
జగనన్న విద్యాదీవెన	904	3,77,94,868
జగనన్న వసతి దీవెన	715	1,20,55,171
విదేశీ విద్యా దీవెన	-	-
వైఎస్సార్ రైతు భరోసా	866	3,90,21,100
వైఎస్సార్ ఉచిత పంటల బీమా	212	69,29,010
వైఎస్సార్ సున్నావడ్డీ పంట రుణాలు	156	4,72,227
రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ	176	14,80,747
వైఎస్సార్ మత్స్యకార భరోసా	5	1,10,000
వైఎస్సార్ పెన్షన్ కానుక	1,200	10,55,95,250
వైఎస్సార్ చేయూత	421	1,86,56,250
వైఎస్సార్ ఆసరా	1,372	3,37,03,619
వైఎస్సార్ సున్నావడ్డీ(గ్రూప్స్)	1,882	61,70,059
వైఎస్సార్ కాపు నేస్తం	98	3,94,50,000
వైఎస్సార్ ఈబీసీ నేస్తం	185	46,80,000
వైఎస్సార్ కళ్యాణమస్తు	-	--
వైఎస్సార్ ఆరోగ్య శ్రీ	391	1,85,15,277
వైఎస్సార్ ఆరోగ్య ఆసరా	223	17,96.925
హౌసింగ్	387	1,98,77.110
వైఎస్సార్ బీమా	26	43, 50,000
వైఎస్సార్ వాహనమిత్ర	206	55.80,000
వైఎస్సార్ నేతన్న నేస్తం	-	-
జగనన్న చేదోడు	151	27, 40,000
కోవిడ్ సాయం	2725	27,25,000
జగనన్న తోడు	51	16,798
మొత్తం		42,62,64,690

నాన్ డీబీటీ

పథకం పేరు	లబ్ధిదారుల సంఖ్య	మొత్తం రూ.లలో
ఇంటి స్థలాలు	529	13,01,34,000
జగనన్న విద్యా కానుక	324	23,01,048
బైజూస్ కంటెంట్ ట్యాబ్స్	43	5,68,546
జగనన్న తోడు(రుణాలు)	158	29,41,802
జగనన్న గోరుముద్ద	293	29,02,751
వైఎస్సార్ సంపూర్ణపోషణ	689	1,29,04,970
వైఎస్సార్‌కంటి వెలుగు	-	-
ఇంటింటికి రేషన్	3,256	7,11,24,064
మొత్తం		22,28,77,181

సమస్యల పరిష్కారంలో అలసత్వం వద్దు



స్పందనలో ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తున్న కమిషనర్ స్వప్నిల్ దినకర్‌పుండ్కర్

వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

భవానీపురం(విజయవాడపశ్చిమ): ప్రజా సమస్యల పరిష్కారంలో అలసత్వం వద్దని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్‌పుండ్కర్ చెప్పారు. 'స్పందన' కార్యక్రమం సోమవారం వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో జరిగింది. ఈ సందర్భంగా కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ ప్రజలకు ఎటువంటి సమస్య ఎదురైనా ప్రతి సోమవారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోగానీ, సమీప సచివాలయాల్లోగానీ నిర్వహించే స్పందన కార్యక్రమంలో తెలియజేయవచ్చన్నారు. అన్ని రకాల పన్నులను సకాలంలో చెల్లించి నగరాభివృద్ధికి సహకరించాలని, నెలాఖరులోపు వ్యాపారస్తులు ట్రేడ్ లైసెన్స్‌లను రెన్యువల్ చేసుకోవాలని కోరారు.

23 అర్జీలను స్వీకరించిన కమిషనర్

సోమవారం స్పందన కార్యక్రమంలో మొత్తం 23 అర్జీలను స్వీకరించామని, వాటిల్లో ఇంజినీరింగ్ శాఖకు సంబంధించి నాలుగు, పట్టణ ప్రణాళిక విభాగానికి సంబంధించి ఆరు ఉండగా రెవెన్యూ శాఖకు తొమ్మిది, యూసీడీ విభాగానికి రెండు, ఎస్టేట్ విభాగానికి రెండు ఉన్నాయని కమిషనర్ వివరించారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ (ప్రాజెక్ట్స్) కె.సత్యవతి, అడిషనల్ కమిషనర్ (జనరల్) ఎ.మహేష్, చీఫ్ ఇంజినీర్ ఎం.ప్రభాకరరావు, చీఫ్ సిటీ ప్లానర్ జీవీజీఎస్‌వీ ప్రసాద్, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పీ రత్నావళి, అకౌంట్స్ ఆఫీసర్ నరసింహమూర్తి, ఆర్ఎఫ్ఓ వెంకటేశ్వరరావు, యూసీడీ పీఓ రోహిణి, జాయింట్ డైరెక్టర్ (అమృత్) లత, ఎస్టేట్ ఆఫీసర్ టీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సంక్షేమ పాలన దేశానికే ఆదర్శం

వైఎస్సార్ సీపీ పశ్చిమ ఇన్‌చార్జి షేక్ ఆసిఫ్

విద్యాధరపురం...

వించిపేట(విజయవాడపశ్చిమ): సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలన దేశానికి ఆదర్శమని రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్, వైఎస్సార్ సీపీ పశ్చిమ ఇన్‌చార్జి షేక్ ఆసిఫ్ పేర్కొన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా కార్పొరేటర్ పూర్ణచంద్రరావు, ఏపీ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ బండి నాగేంద్ర పుణ్యశీలతో కలసి 55వ డివిజన్‌లోని కంసాలిపేటలో పర్యటించి ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుతీరుపై స్థానిక మహిళలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటిలో ఏదో ఒక పథకం రూపంలో లబ్ధిపొందుతూ తమ పిల్లలను చదివించుకుంటూ సంతోషంగా ఉన్నామని ప్రజలు చెప్పడం ఆనందంగా ఉందని ఆసిఫ్ తెలిపారు. రానున్న రోజుల్లో వారంత జగనన్నకు మద్దతుగా నిలిచి వైఎస్సార్ సీపీని అధికారంలోకి తీసుకురావడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. ముఖ్యమంత్రి జగన్‌ను ఎదుర్కొనే దమ్ములేక ప్రతిపక్షాలన్నీ కూటమిగా ప్రజలను మభ్యపెట్టేందుకు ప్రయత్నిస్తున్నాయని ఎద్దేవా చేశారు.

గత టీడీపీ ప్రభుత్వంలో ఆలయాలను, మసీదులు, చర్చిలను కూలగొట్టినప్పుడు టీడీపీ కూటమిలో ఉన్న జనసేన, బీజేపీ నేతలు ఎందుకు స్పందించలేదని ఆరోపించారు. ఇప్పుడు మళ్లీ అదే పొత్తులతో ప్రజలను మభ్యపెట్టేందుకు వస్తున్నారని, వారు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు షేక్ బాజీ బాబా, సుభానీ, సల్మా సుల్తానా, రాజారమేష్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.



55వ డివిజన్ కంసాలిపేటలో స్థానిక మహిళలతో మాట్లాడుతున్న ఆసిఫ్

బీసీల అభ్యున్నతికి సీఎం జగన్ కృషి



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): రాష్ట్రంలో బీసీల అభ్యున్నతికి అండగా నిలిచిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని ఏపీ స్టేట్ మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్, వైఎస్సార్ సీపీ పశ్చిమ సమన్వయకర్త షేక్ ఆసిఫ్ అన్నారు. మార్చి రెండో తేదీన జరిగే 139 బీసీ కులాల ఆత్మీయ సమావేశానికి రావాలని కోరుతూ బీసీ నాయకులు ఆసిఫ్ కార్యాలయంలో ఆయనను కలిసి ఆహ్వానపత్రికను అందించారు. ఈ సందర్భంగా ఆసిఫ్‌ను బీసీ నాయకులు సత్కరించారు. అనంతరం ఆసిఫ్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఆయా బీసీ కులాలకు కార్పొరేషన్లను ఏర్పాటు చేసి వారి వికాసానికి ప్రభుత్వం పాటుపడుతోందన్నారు. బీసీలకు అనేక పదవులను కేటాయించి వారిని రాజ్యాధికారంలో భాగస్వాములను చేశారన్నారు. రానున్న ఎన్నికల్లోనూ బీసీలకు అత్యధిక ప్రాధాన్యమిస్తున్నారని వివరించారు. కార్యక్రమంలో బీసీ నాయకులు బెజవాడ గణేష్, రాష్ట్ర బీసీ మహిళా అధ్యక్షురాలు వి. బేబీరాణి, చల్లపల్లి జెడ్పీటీసీ రాజులపాటి రాణి, వైఎస్సార్ సీపీ యువజన కార్యదర్శి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీలో విద్యార్థుల ప్రతిభ

ఇబ్రహీంపట్నం(మైలవరం): వికసిత్ భారత్–వికసిత్ రైల్వే–2047 అనే అంశంపై సోమవారం నిర్వహించిన వ్యాస రచన పోటీలో గుంటుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు ఆర్. జాహ్నవి ప్రథమ, కీర్తన ద్వితీయ, డి.సిద్దార్థ తృతీయ స్థానాలు సాధించగా వీరిని హెచ్ఎం ఎం.సంధ్యారాణి అభినందించారు. విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు.

మెట్ల మార్గాల నిర్మాణానికి శ్రీకారం

లబ్బీపేట(విజయవాడతూర్పు): కార్మికనగర్ కొండ ప్రాంతంలో మెట్లు శిథిలావస్థకు చేరి ప్రజల రాకపోకలకు ఇబ్బందిగా ఉండటంతో, వాటి పునర్నిర్మాణ పనులకు సోమవారం స్థానిక రెండో డివిజన్ కార్పొరేటర్ అంబడిపూడి నిర్మలకుమారి శ్రీకారం చుట్టారు. అందులో భాగంగా రూ.13 లక్షలతో చేపట్టనున్న పనులను స్థానికులతో కలిసి భూమి పూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ నిర్మలకుమారి మాట్లాడుతూ కార్మికనగర్ కొండ ప్రాంతంలో అనేక సమస్యలు ఉండేవన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సుమారు రూ.8 కోట్లు వెచ్చించి డివిజన్‌లో మెట్ల మార్గాలు, డ్రెయిన్‌లు నిర్మాణం చేసినట్లు తెలిపారు. గత ప్రభుత్వం అభివృద్ధిని విస్మరించడంతో కొండ ప్రాంత వాసులు అనేక ఇబ్బందులు పడినట్లు తెలిపారు. రాష్ట్రంలో పేదల ప్రభుత్వం అధికారంలోకి రావడంతో తమ సమస్యలు తీరాయని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానికులు శేఖర్‌బాబు, కనపర్తి బాబు, అలంకార్ బాబు, కోటేశ్వరరావు, గిరి, సత్యనారాయణ, మహాలక్ష్మి, శేషగిరి తదితరులు పాల్గొన్నారు.



మెట్ల మార్గాల పునర్నిర్మాణ పనులకు శంకుస్థాపన నేతలు

మహిళా సాధికారతే సీఎం జగన్ లక్ష్యం

మేయర్ రాయన భాగ్యలక్ష్మి

భవానీపురం(విజయవాడపశ్చిమ): మహిళా సాధికారతే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని మేయర్ రాయన భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. మెప్మా సహకారంతో సోమవారం పూజిత మహిళా సొసైటీ ఆఫ్ డెవలప్‌మెంట్ సంస్థ సెంట్రల్ నియోజకవర్గం 59వ డివిజన్‌కు చెందిన సుమారు వంద మంది మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్లను పంపిణీ చేశారు. అజిత్‌సింగ్‌నగర్ గుజ్జుల సరళాదేవి కల్యాణ మండపంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా మేయర్ భాగ్యలక్ష్మి, ఎంపీ కేశినేని శ్రీనివాస్(నాని), ఎమ్మెల్సీ రుహుల్లా, సెంట్రల్ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ వెలంపల్లి శ్రీనివాసరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ మహిళా సాధికారతే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ప్రతి ప్రభుత్వ సంక్షేమ పథకం మహిళల పేరుతో అందించడమే అందుకు నిదర్శనమన్నారు. ఎంపీ కేశినేని నాని మాట్లాడుతూ రాష్ట్రంలో పేదల సొంతింటి కల సాకారం చేసేందుకు 31లక్షల ఇళ్ల స్థలాలు మహిళల పేరిట ఇచ్చి సీఎం జగనన్న మహిళా పక్షపాతిగా నిలిచారని కొనియాడారు. ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు స్వయం ఉపాధి కల్పించే దిశగా కుట్టు మిషన్లను ఉచితంగా అందించటం అభినందనీయమన్నారు.

ఎమ్మెల్సీ రుహుల్లా మాట్లాడుతూ మహిళలు స్వశక్తితో తమ కాళ్ల మీద తాము నిలబడేలా మెప్మా ఇటువంటి కార్యక్రమం నిర్వహించడం ముదాహవమని పేర్కొన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, మెప్మా మేనేజింగ్ డైరెక్టర్ విజయలక్ష్మి, విజయవాడ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కొనకళ్ల విద్యాధరరావు, మాజీ డిప్యూటీ మేయర్ గోగుల రమణారావు, పూజిత మహిళా సొసైటీ ఆఫ్ డెవలప్‌మెంట్ సంస్థ చైర్‌పర్సన్ ఎర్రబోతుల కోటేశ్వరి, వైఎస్సార్ సీపీ నాయకులు ఉమ్మడి వెంకటరావు, పెనుమత్స సత్యం తదితరులు పాల్గొన్నారు.



కుట్టుమిషన్లు అందజేస్తున్న భాగ్యలక్ష్మి, కేశినేని, వెలంపల్లి, రుహుల్లా

6 నుంచి పాత శివాలయంలో మహాశివరాత్రి మహోత్సవాలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం (పాతశివాలయం)లో మార్చి ఆరు నుంచి 13వ తేదీ వరకూ మహాశివరాత్రి కల్యాణ మహోత్సవాలను నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారిణి లోకేశ్వరి తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం ఆలయంలో ఉత్సవాల కరపత్రాన్ని ఆవిష్కరించినట్లు పేర్కొన్నారు. ఉత్సవాల్లో భాగంగా మార్చి ఎనిమిదో తేదీన మహాశివరాత్రి వేడుకలు, తొమ్మిదిన రథోత్సవం తదితర కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు. ఆవిష్కరణ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ బొమ్మ మధు ఇతర పాలకవర్గ సభ్యులు పాల్గొన్నట్లు వివరించారు. తొలి ఆహ్వానాన్ని పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, మేయర్ రాయన భాగ్యలక్ష్మి, ఎమ్మెల్సీ రుహుల్లాకు అందించినట్లు వివరించారు.



ఆహ్వానపత్రికను ఆవిష్కరిస్తున్న ఆలయ పాలకవర్గం

భార్య అదృశ్యంపై భర్త ఫిర్యాదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): భార్య కనిపించడం లేదంటూ భర్త పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఘటనపై పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పాత రాజరాజేశ్వరిపేట మహంకాళి గుడి ప్రాంతానికి చెందిన జంకర్ జవాన్, లలితలు భార్యభర్తలు. వీరికి 13 ఏళ్ల కిందట వివాహమైంది. వీరికి సంతానం లేరు. ఇటీవల జవాన్ చీటి పాడగా వచ్చిన రూ.1.40 లక్షలు భార్యకు ఇచ్చి జాగ్రత్త చేయమని చెప్పాడు. కొద్ది రోజుల క్రితం డబ్బులు ఇవ్వాలని కోరగా, అందులో కేవలం రూ. 50 వేలు మాత్రమే ఇచ్చింది. దీంతో భార్యభర్తలకు గొడవ జరిగింది. శనివారం రాత్రి భార్యాభర్తలిద్దరూ భోజనాలు చేసిన తర్వాత నిద్రపోయారు. అర్ధరాత్రి 2 గంటలకు నిద్రలేచిన జవాన్‌కు భార్య ఫోన్ చూస్తూ కనిపించింది. కొంత సమయం తర్వాత ఇంట్లో భార్య కనిపించకపోవడంతో చుట్టు పక్కల వెదికినా ఫలితం లేదు. దీంతో తన భార్య కనిపించడం లేదంటూ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

మరో ఘటనలో..

ఇద్దరు బిడ్డలతో సహా తల్లి అదృశ్యమైన ఘటన కొత్తపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. ఘటనపై తండ్రి ఇచ్చిన ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేశారు. వించిపేట సీఎస్ఐ చర్చి ప్రాంతానికి చెందిన జె.నిరీక్షణ, ఝాన్సీరాణి భార్యాభర్తలు. వీరికి అశ్విని, హర్ష ఇద్దరు సంతానం. భార్యాభర్తలిద్దరూ విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్‌లో స్వీపర్లుగా విధులు నిర్వహిస్తుంటారు. ఈ నెల 22వ తేదీ మధ్యాహ్నం డ్యూటీ నుంచి వచ్చిన భార్యాభర్తలిద్దరూ, భోజనం తర్వాత నిరీక్షణ మాత్రమే డ్యూటీకి వెళ్లాడు. భార్య తనకు ఒంట్లో బాగోలేదని చెప్పడంతో ఇంటి వద్దే ఉండిపోయింది. మధ్యాహ్నం రెండు గంటల తర్వాత ఝాన్సీ రాణి కొన్ని బట్టలను సంచిలో వేసుకుని ఇద్దరు పిల్లలను తీసుకుని బయటకు వెళ్లిపోయింది. భార్యాపిల్లల కోసం ఎంత వెదికినా ఫలితం లేకపోవడంతో బాధితుడు పోలీసులను ఆశ్రయించగా కేసు నమోదు చేశారు.